క్లుప్తంగా

'డబుల్' ఇళ్ల సర్వే షురూ

జగద్గిరిగుట్ట: డబుల్ బెడ్‌రూమ్‌కు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల సర్వే మొదలైంది. డివిజన్ పరిధిలోని దేవమ్మ బస్తీ, మగ్దూం నగర్‌లలో మంగళవారం మొదలైన ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు సుమారు 80 దరఖాస్తులు పూర్తి చేశారని అధికారులు తెలిపారు.

కార్గిల్‌లో సైనికుల వీర మరణం వెలకట్టలేనిది

సుభాష్‌నగర్: కార్గిల్ యుద్ధంలో సైనికుల వీర మరణం వెలకట్టలేనిదని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. బుధవారం సూరారం వెంకట్రామ్‌నగర్‌లోని నార్త్ సిటీ హైస్కూల్‌లో కార్గిల్ డేను నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించి 2నిమిషాలు మౌనం పాటించారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

చింతల్: సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈనెల 13న ఉదయం 10గంటలకు రవీంద్రభారతిలో పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు వట్టికుటి రామారావుగౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు శేషగాని సరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి బీసు వెంకటేశంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భానుగౌడ్, శంకర్‌గౌడ్, మధుగౌడ్ పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ ఎస్‌ఆర్‌నాయక్ నగర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్ వద్ద కల్వర్టు పనులను బుధవారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనప్రియ అపార్ట్‌మెంట్ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

బీఎంఎస్‌ను గెలిపించాలి

కుత్బుల్లాపూర్: కార్మికుల పక్షాన పోరాడే బీఎంఎస్‌ను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. కొంపల్లిలోని హిల్టన్ టొబాకో కంపెనీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికుల గేట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. గతంలో బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికులకు 9వేల వేతన ఒప్పందం చేశామన్నారు. మరో దఫా అవకాశమిస్తే ఈఎస్ఐ నుంచి మినహాయింపు పొందిన కార్మికులకు హెల్త్‌కార్డులు, కరువు భత్యం అమలు చేస్తామన్నారు. మెరుగైన రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లు పొందేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జయేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ జనార్దన్‌రెడ్డి, వి.లక్ష్మారెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, సంపత్‌చారి, శ్రీరాములు, కార్మికులు పాల్గొన్నారు.

వరదనీరు చేరకుండా చర్యలు తీసుకోండి

చింతల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్‌లోకి వర్షపు నీరు చేరుతోంది. దీంతో ఉదయం 9 గంటలకే క్యాష్ కౌంటర్ తెరవాల్సి ఉండగా పనిచేసే సిబ్బంది నీటిని తోడి అనంతరం క్యాష్‌కౌంటర్ తెరవాల్సి వస్తోంది. దీంతో నీటి బిల్లులు చెల్లించే వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న బుధవారం జీఎం శ్రీధర్‌రెడ్డి సిబ్బందితో కలిసి క్యాష్ కౌంటర్ పరిశీలించారు. వరదనీరు చేరకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నిధులు మంజూరు చేయాలి

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ జగన్ బుధవారం కూకట్‌పల్లి జెడ్సీ మమతకు వినతి పత్రం అందచేశారు. డివిజన్ పరిధిలోని శ్మశానవాటికలకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. భూదేవిహిల్స్‌లో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టి ఓటరుకార్డులు మంజూరు చేసేల చర్యలు చేపట్టాలన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన మమత వీలైనంత తొందరగా నిధుల మంజూరు అయ్యేట్లు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారన్నారు. అలాగే త్వరలోనే అధికారులతో మాట్లాడి ఓటరు నమోదు కార్యక్రం చేపడతామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

సుభాష్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం మెట్కానిగూడకు చెందిన బోయిన మహేష్, శ్రీదేవి (39) లు భార్యాభర్తలు. కాగా మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీదేవి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలోనే తమ కుమార్తె మృతి చెందిందని మృతురాలి తల్లి లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాలా కల్వర్టు.. వెళ్లాలంటే కష్టాలు.!

మూడు నెలలుగా కొనసాగుతున్న పనులు

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- ఉదయం, సాయంత్రం వేళ్లలో ట్రాఫిక్ జామ్
- ట్రాఫిక్ మళ్లించినా అదే పరిస్థితి
- నెల అని చెప్పి నేటికీ పూర్తి చేయలేదు: స్థానికులు



కేఎంజీ కాలనీ రోడ్డులో ట్రాఫిక్ జామ్

రంగారెడ్డినగర్: మూడు నెలలుగా కొనసాగుతున్న నాలా కల్వర్ట్ పనులు వాహనదారుల పాలిట శాపంగా మారాయి. వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగేందుకు చింతల్ మార్కెట వద్ద ఏప్రిల్ 28న జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ట్విన్ బాక్స్ కల్వర్ట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. కానీ మూడు నెలలైనా పూర్తికాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరుకు రోడ్ల గుండా ట్రాఫిక్ మళ్లింపుతో ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ రద్దీతో వాహనదారులకు చుక్కలు కనబడుతున్నాయి. స్కూళ్లకు తమ చిన్నారులు తీసుకువెళ్లే తల్లిదండ్రులు, ఉద్యోగాలు, వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే వారు ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంటుంటే.. మరో వైపు అకాల వర్షాలతో నానా ఆగచాట్లు పడుతున్నారు. నాలా కల్వర్ట్ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో.. తమ ఇబ్బందులు ఎప్పుడు తీరుతాయోనని.. వేయి కళ్లతో సమీపం ప్రాంతవాసులు ఎదురు చూస్తున్నారు.

శ్లాబ్ వరకే పనులు పూర్తి..

- ట్విన్ బాక్స్ నాలా కల్వర్ట్ పనులు ఇప్పటి వరకు శ్లాబ్ వరకే పూర్తయ్యాయి. ప్రస్తుతం నాలాలోకి భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. ఇంకా కల్వర్ట్‌కు అటు.. ఇటుగా చదును చేసి సమాంతరంగా రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది.

ట్రాఫిక్ మళ్లింపుతో ఇబ్బందులు..

- చింతల్ ప్రధాన రోడ్డు నుంచి పద్మానగర్‌రింగ్ రోడ్డుకు వెళ్లే వాహనదారులను ఎల్లమ్మ ఆలయం పక్క నుంచి వాణీనగర్, కుత్బుల్లాపూర్ గ్రామాల మీదుగా పంపిస్తున్నారు.
- అదే విధంగా పద్మానగర్ రింగ్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను మాణిక్యనగర్ కమాన్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కేఎం పాండు విగ్రహం మీదుగా చింతల్ ప్రధాన రోడ్డుకు మళ్లిస్తున్నారు.



శ్లాబ్ వరకే పూర్తయిన నాలా కల్వర్టు పనులు

- పద్మానగర్ రింగ్ రోడ్డు మీదుగా ఫ్రైచికెన్ మార్కెట్, అంబేడ్కర్‌నగర్ రోడ్డు, అంబేడ్కర్ విగ్రహం, రామిరెడ్డినగర్, రెయిన్‌బో హైస్కూల్ నుంచి ఐడీపీఎల్ ప్రధాన రోడ్డుకు మళ్లిస్తున్నారు.
- అయితే మాణిక్యనగర్, కేఎంజీ కాలనీల మీదుగా వాహనాల మళ్లింపుతో అసలే ఇరుకుగా ఉన్న రోడ్లతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్కూళ్ల ఆలస్యం కావడంతో యాజమాన్యాలు తమ పిల్లలను తరగతులకు అనుమతించడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్న పాదచారులు..

- నాలా కల్వర్ట్ పనుల నేపథ్యంలో వాహనదారులు తంటాలు పడి ఏదోలా రాకపోకలు సాగిస్తున్నా.. పాదచారులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలా దాటి వెళ్లేందకు ఇరువైపులా ఉన్న మట్టి కుప్పలను ఆపసోపాలు పడుతూ దాటాల్సిన పరిస్థితి నెలకొంది.
- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చిత్తడిగా మారడంతో నాలాను నడకదారిన దాటేందుకు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. నాలాను మట్టి కుప్పలు మీదుగా దాటే క్రమంలో కొందరు వృద్ధులు జారి పడి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు.

పనుల కారణంగా ఆర్టీసీ సేవలు బంద్..

- చింతల్ ప్రధాన రోడ్డు నుంచి సుచిత్ర సర్కిల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు సేవలను కల్వర్ట్ నిర్మాణ పనుల నేపథ్యంలో రద్దు చేశారు. దీంతో అంబేడ్కర్‌నగర్, శ్రీనివాస్‌నగర్, రామిరెడ్డినగర్, పద్మానగర్, మాణిక్యనగర్ తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది.
- పేద, మధ్య తరగతి విద్యార్థులు ఆర్టీసీ బస్సు పాస్‌లున్నా తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇంకెన్ని రోజులు కల్వర్ట్ పనులు కొనసాగిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

కనిపించని ట్రాఫిక్ సిబ్బంది..

- నాలా కల్వర్ట్ నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన ట్రాఫిక్ ఉన్నతాధికారులు సిబ్బంది మాత్రం నియమించ లేదు. దీంతో త్వరగా గమ్యస్థానాలకు వెళ్లాలనే ఆతృతతో అటు, ఇటుగా వచ్చే వాహనదారులు పోటీ పడుతుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో ఒక్కోసారి వాహనదారులు వాదోపవాదాలకు దిగుతున్నారు. రద్దీ ప్రాంతంలో ట్రాఫిక్ సిబ్బందిని నియమిస్తే ట్రాఫిక్ జామ్ సమస్య కాస్త తగ్గుముఖం పడుతుందని వాహనదారులు కోరుతున్నారు.



కల్వర్ట్ సమీపంలో కొనసాగుతున్న పైపులైన్ పనులు

కొద్ది దూరానికే అర్ధగంట పడుతోంది..



మా పిల్లలను స్కూళ్లలో దింపేందుకు నానా యాతనలు పడాల్సి వస్తోంది.. కేఎంజీ కాలనీ మీదుగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా ఉంటోంది. 500 మీటర్ల దూరం దాటాలంటే దాదాపు అర్ధ గంట సమయం పడుతోంది. సమయం మించి పోవడంతో స్కూల్ గేట్లు మూసేసి పిల్లలను లోనికి అనుమతించడం లేదు. ట్రాఫిక్ సిబ్బందిని నియమిస్తే రాకపోకలకు ఆటంకం కలుగకుండా ఉంటుంది. – అబ్దుల్ రహీం, హోటల్ యజమాని, మాణిక్యనగర్

పనులతో వ్యాపారం లేదు..



మూడు నెలలుగా వ్యాపారం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం. పాన్ డబ్బా మీదనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. కల్వర్ట్ పనులతో ఇటుగా రాకపోకలు బంద్ కావడంతో మా వ్యాపారంపై ప్రభావం పడింది. అప్పులు చేయాల్సి వస్తోంది. కల్వర్ట్ పనులు ఎప్పుడు పూర్తవుతాయో.. మా ఆర్థిక కష్టాలు ఎప్పుడు తీరుతాయో. – వంశీ, పాన్ డబ్బా నిర్వాహకుడు



చింతల్ మార్కెట్ రోడ్డులో నాలా కల్వర్ట్ వద్ద మట్టి కుప్పలు ఉండటంతో పాదచారుల ఇబ్బందులు

అత్యవసరం ఉంటేనే ప్రజలు బయటకు రావాలి

కుత్బుల్లాపూర్: భారీ వర్ష సూచన ప్రకటన నేపథ్యంలో అన్ని శాఖల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. వాతావరణ శాఖ రెండు రోజుల పాటు రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇరిగేషన్, జలమండలి, ఇంజినీరింగ్ శాఖ అధికారులు సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువును ఆనుకుని ఉన్న ముంపు ప్రాంతాలను సందర్శించారు. ప్రజలు అత్యవసరముంటే తప్ప బయటకు రావొద్దని.. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఎస్ఈ. చిన్నా రెడ్డి, జలమండలి జీఎం శ్రీధర్ రెడ్డి, డీజీఎం రాజేష్, మేనేజర్ రాజు, డీఈఈలు భాను, నరేందర్, ఏఈలు రామారావు, సురేందర్ నాయక్ లు ఉన్నారు.



వరద ముంపు ప్రాంతాల విషయమై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

- సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరైన రూ.10 లక్షల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే ఆరుగురి లబ్ధిదారులకు అందజేశారు.
- సూరారం కట్ట మైసమ్మ ఆలయం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇదేనా.. మంత్రి కేటీఆర్ చెబుతున్న విశ్వనగరం

మంత్రి చిత్రాలను చేతపట్టి నిరసన తెలిపిన కాంగ్రెస్

కుత్బుల్లాపూర్: ఇదేనా.. కేటీఆర్ చెబుతున్న విశ్వనగరం అని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి మండిపడ్డారు. ప్రధాన రహదారుల్లో వరదనీరు చేరి వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై బుధవారం కాంగ్రెస్ నాయకులు మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీతో నిరసన తెలియజేశారు. హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లి, కైసర్ నగర్, గాజులరామారం, ఓక్షిత్ ఏంక్లేవ్, సూరారం, కృష్ణ నగర్, గండిమైసమ్మ చౌరస్తా తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిన చోట పర్యటించారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ పలు సందర్భాల్లో అమెరికాలోని డల్లాస్, వాషింగ్‌టన్‌లకు దీటుగా నగరాన్ని అభివృద్ధి చేస్తానన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం వర్షం వస్తే రోడ్లన్నీ కాలువలవుతున్నాయని.. ఇదేనా మీరు పేర్కొంటున్న విశ్వనగరమని మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. ముందు డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించి గుంతల రోడ్లను బాగు చేయాలన్నారు. ఈ నిరసనలో నాయకులు జేమ్స్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, పండరి రావు, కోలన్ రాజశేఖర్‌రెడ్డి, యూసఫ్, అంజద్, షఫీ, హనీఫ్, బాబన్, విక్రాంత్, సజ్జు ఖాన్, రహీమ్ ఖాన్, ఖలీమ్ ఖాన్, దొర అరుణ్, హాజీమ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి, నాయకులు

భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉన్నాం

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అత్యవసర చర్యలు చేపట్టాలన్న ఆదేశాలతో జిల్లాలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. బుధవారం టెలీకాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన మేరకు జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే.. అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నంబర్ 94924-09781కు ఫోన్ చేయాలని కలెక్టర్ అమయ్ కుమార్ ప్రజలను కోరారు.

ఈ ఫోన్ నంబర్లను సంప్రదించండి

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫోన్ నంబర్ 040-27215959, జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 99639-96908, 8074064746, నిజాంపేట కార్పొరేషన్‌లో 040-29569700, ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 73311-64056, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో 96667-03077, దుండిగల్ మున్సిపాలిటీలో 95427-15377, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో 91540-83772, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో 81435-89845, కొంపల్లి మున్సిపాలిటీలో 18004257590, మేడ్చల్ మున్సిపాలిటీలో 93920-11506, 86390-50325 , నాగారం మున్సిపాలిటీలో 96400-10053, పోచారం మున్సిపాలిటీలో 89857-73105, తూంకుంట మున్సిపాలిటీలో 91542-79694.

భవిష్యత్ నాయకులుగా నేటి యువతను తీర్చిదిద్దాలి

ఎండీసీఎల్ ఛైర్మన్ మన్నె క్రిషాంక్

దుండిగల్: ప్రపంచ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనగలిగే భవిష్యత్ నాయకులుగా నేటి యువతను తీర్చిదిద్దాలని రాష్ట్ర ఎండీసీఎల్ ఛైర్మన్ మన్నె క్రిషాంక్ అన్నారు. బుధవారం బాచుపల్లిలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ×ది మోడల్ యునైటెడ్ నేషన్స్(ఎంయూఎన్)ౕసదస్సు నిర్వహించారు. అందులో 40 పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థి ప్రతినిధులు హాజరయ్యారు.

- ఈ సందర్భంగా క్రిషాంక్ మాట్లాడుతూ.. ప్రపంచ వేదికపై గణనీయమైన ప్రభావం చూపే భావిభారత నాయకులను ఓక్రిడ్జ్ బాచుపల్లి ఎంయూఎన్ తయారు చేస్తుందనడంతో సందేహం లేదన్నారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ బల్జిత్ ఒబెరాయ్ చర్చల ప్రాముఖ్యతను వివరించారు. ఎంయూఎన్ వంటి వేదికల ద్వారా విద్యార్థులలో విమర్శనాత్మకమైన ఆలోచన సరళి, దౌత్య నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు. చురుకైన ప్రపంచ పౌరులుగా మారడానికి వీలు కల్పిస్తుందన్నారు.



మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో మన్నె క్రిషాంక్

- ఓక్రిడ్జ్ బాచుపల్లి ఎంయూఎన్-2023 డైరెక్టర్ జనరల్ రామకృష్ణ పింజలా డైరెక్టర్ జనరల్ అక్షిత్ మాట్లాడుతూ... ఎంయూఎన్ సానుకూల మార్పును నడిపించగల మన యువత సామర్థ్యానికి నిదర్శనమన్నారు. యువతను శక్తివంతం చేసే సానుకూల ప్రభావాన్ని సృష్టించే ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం కృషి చేస్తోందన్నారు.

ప్రతిపక్షాలు కుట్రలను కార్యకర్తలు తిప్పికొట్టాలి



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన నాయకులు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కుట్రలు చేస్తే తిప్పి కొట్టేందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయానికి విచ్చేసిన పలువురి సమస్యలు విన్న ఆయన సంబంధిత అధికారులకు ఫోన్లలో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ... ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అవాకులు చేవాకులు చేసే ప్రతిపక్ష నాయకులకు దీటుగా పార్టీ కార్యకర్తలు, నాయకులు స్పందించాలని కోరారు. మేడ్చల్ జిల్లాలో ఇప్పటికే కార్యాచరణ రూపొందించుకుని నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఐదు నియోజకవర్గాల్లో విజయఢంకా మోగిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌కు వరద ఉధృతి



ఓక్షిత ఎన్‌క్లేవ్‌లో వరదనీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు..

సుభాష్‌నగర్: మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గాజులరామారం డివిజన్ ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌లో వరద ఉధృతి పెరిగింది. దీంతో కాలనీ ప్రజలు నిత్యవసర వస్తువుల కోసం బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద నాలా రోడ్డుపై నుంచి ప్రవహించడంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. సూరారం రాజీవ్ గృహకల్పలో వర్షానికి రోడ్లన్నీ మురికి కోపంగా మారాయి.

బీజేపీతోనే బంగారు తెలంగాణ సాధ్యం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని... బీజేపీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవిహిల్స్ కాలనీకి చెందిన సుమారు 100మంది బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. బుధవారం గాజులరామారంలోని పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు.

- అనంతరం కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధే తప్ప భూదేవిహిల్స్‌లో కొత్తగా మౌలిక వసతులు కల్పించలేదన్నారు. భారీ వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీజేపీ శ్రేణులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు.



యువకులకు బీజేపీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

- తిరుపతి గౌడ్, సైదులు, సగ్గం నరసింహ, యాదగిరి, రవి చారీ, శ్రీనివాస్, జనార్దన్, రాజనీష్, అయోధ్య, శివ గౌడ్, శేఖర్ సాగర్, ప్రభాకర్ సాగర్, సత్యం, వెంకన్న, బాపూజీ, సుమన్, రాయుడు తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పున్నా రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మేకల సురేష్ రెడ్డి, డివిజన్ నాయకులు మహేందర్, నరేష్, వసుంధర, శ్రవణ్, అరుణ రెడ్డి, అరుణ్, అభిలాష్, పరశురామ్, ప్రమోద్, సాంబయ్య, రాకేష్, ముప్పిడి రవి, లక్ష్మణ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.